దారి మళ్లింపుతో ట్రాఫిక్ జామ్

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

విధుల్లో నిర్లక్ష్యంగా ట్రాఫిక్ పోలీసులు


కృష్ణానగర్‌లో నిలిచిన వాహనాలు

యూసుఫ్‌గూడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కృష్ణానగర్, వెంకటగిరి ప్రధాన రహదారుల్లో కొన్ని రోజులుగా జరుగుతున్న అభివృద్ధి పనుల కారణంగా జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ నుంచి వచ్చే వాహనాలను మూడు రోజులుగా ట్రాఫిక్ పోలీసులు దారి మళ్లించారు. దీంతో ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం కృష్ణానగర్, ఇందిరానగర్ గడ్డ మెట్రో పిల్లర్ నెంబర్ సి.1551 వద్ద, ఇందిరానగర్ శ్రీనగర్ కాలనీ వెళ్లే రహదారిని మూసివేశారు. జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ నుంచి వచ్చే వాహనాలను వెంకటగిరి చౌరస్తాలో మెట్రో పిల్లర్ నెంబర్ సి.1574 నుంచి వెంకటగిరి రాకుండా కమలాపురి కాలనీ వైపు మళ్లించారు. దీంతో ప్రధానంగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. ట్రాఫిక్ నియంత్రణకు నియమించిన పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రహదారి పక్కన నిలబడి ప్రశాంతంగా ముచ్చట్లు పెడుతున్నారు. దీంతో వాహనదారులు త్వరగా వెళ్లాలనే తొందరలో అడ్డదిడ్డంగా వాహనాలను నడుపుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. పది నిమిషాల్లో వెళ్లాల్సిన ప్రాంతానికి అరగంటైనా వెళ్లలేక పోతున్నామని వాహన దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ ఉన్నతాధికారులు ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకోవాలని వాహన దారులు కోరుతున్నారు.


ట్రాఫిక్ రద్దీలో ముగ్గురు ట్రాఫిక్ సిబ్బంది ముచ్చట్లు


రోడ్డు మధ్యలో ఆగిన ఆటోను నెడుతున్న ప్రయాణికులు

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



వెంకటగిరి చౌరస్తా, కృష్ణానగర్, ఇందిరానగర్ గడ్డ దారి మళ్లించిన ప్రాంతాల్లో వాహన దారులకు ఇబ్బంది కలగకుండా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి. ఉదయం, సాయంత్రం సమయాల్లో తప్పని సరిగా ట్రాఫిక్ పోలీసులను విధుల్లో ఉంచాలి. ట్రాఫిక్ సమస్యపై ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలి.

కుంచ రాధిక, కృష్ణానగర్

నాలాపై కుంగిన కల్వర్టు


కుంగిన కల్వర్టు

రాకపోకలకు ఇబ్బందులు

హైటెక్ సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బోరబండ సైట్-3 నుంచి మాదాపూర్ వెళ్లే రహదారిలో నాలాపై వేసిన కల్వర్టు కుంగింది. నిత్యం వేలాది వాహనదారులు వెళ్లే ఈ మార్గంలో వా రం రోజులుగా వాహనాల రాకపోకలకు ఇబ్బంది లు ఎదురవుతున్నాయి. మాదాపూర్ వెళ్తుంటే కు డి వైపు కల్లు కాంపౌండ్ సమీపంలో నాలా ప్రవహిస్తోంది. దానిపై ఎటువంటి పై కప్పు లేదు. అసలే ఇరుకు రోడ్డు ఆ పై ఉన్న రోడ్డులో కొంతబాగం కుంగింది. దీంతో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ట్రాఫిక్ రద్దీ నెలకొంటోంది.

పట్టించుకోని అధికారులు

ఈ మార్గం హైదరాబాద్-రంగారెడ్డి సరిహద్దుల్లో ఉంది. రెండు ప్రాంతాల అధికారులు ఎవరికి వారు తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఇటీవల హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అయినప్పటికీ నాలాపై కప్పు వేయలేదు. కుంగిన కల్వర్టును పునరుద్ధరించలేదు.

రహదారుల్లో వినాయక మండపాలు...

ట్రాఫిక్ జామ్ అయిన సమయంలో సమీపంలోని గల్లీల నుంచి ద్విచక్ర వాహనదారులు వెళ్లేవారు. వినాయక మండపాలు పెట్టడంతో అంతర్గత రహదారులు మూసుకు పోయాయి. దాంతో వాహన దారులు నరకయాతన పడుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

గణ నాయకా.. ప్రణమామ్యహం!


రాజీవ్ నగర్ గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కిలారి మనోహర్


దైవసన్నిధానంలో వినాయకుడికి ఐదు లక్షల రూపాయల కరెన్సీ నోట్లతో అలంకరణ

బంజారాహిల్స్/యూసుఫ్‌గూడ/ఎర్రగడ్డ/బోరబండ/బేగంపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఫిలింనగర్ దైవసన్నిధానంలోని వినాయక ఆలయంలో స్వామి వారికి రెండో రోజు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐదు లక్షల రూపాయల కరెన్సీ నోట్లతో అలంకరణ గావించారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.10 బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఆవరణలో ఉన్న విజయగణపతి ఆలయంలో స్వామి వారికి పసుపు, కుంకుమతో ప్రత్యేక అలంకరణ చేసి పూజాధికాలు నిర్వహించారు. గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. రాజీవ్ నగర్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.


విజయ గణపతి ఆలయంలో స్వామివారికి పసుపు కుంకుమ అలంకరణ


రహ్మత్ నగర్ భారత్ మాతా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో బీజేపీ నాయకులతో కలిసి పూజల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


గణపతి కాంప్లెక్స్ వద్ద అన్నదానం చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు మాగంటి వజ్రనాథ్, పాల్గొన్న సల్ల శ్రీనివాస్ యాదవ్, బస్వరాజ్ తదితరులు


నవోదయ కాలనీ గణపతి కాంప్లెక్స్‌లో ఏర్పాటుచేసిన వినాయకుడు వద్ద పూజలు నిర్వహించిన అపార్ట్‌మెంట్ వాసులు


ఖైరతాబాద్ గణేశుడి వద్ద ప్రత్యేక పూజలు చేసిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్


రహ్మత్ నగర్, శ్రీనగర్ కాలనీ డివిజన్లలో వినాయకులను దర్శించుకొని పూజాధికాలు నిర్వహించిన కాంగ్రెస్ నాయకురాలు కంజర్ల విజయలక్ష్మి


ఖైరతాబాద్ గణేశుడి వద్ద ప్రత్యేక పూజలు చేసిన హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ


అంజన్ కుమార్ యాదవ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు

నాయీ బ్రాహ్మణులకు అండగా ఉంటా

● మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్

ఎర్రగడ్డ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణులకు అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎంపీ ఎం. అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. నాయీ బ్రాహ్మణ సంఘం జూబ్లీహిల్స్ నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయీ ఆధ్వర్యంలో శుక్రవారం మాజీ ఎంపీకి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి జి.యాదగిరి నాయీ, కోశాధికారి దత్తు నాయీ, నాయకులు విజయ్, సత్తన్న, స్వామి, శివశంకర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బధిరుల కోసం ప్రత్యేక టెక్నాలజీ కోర్సు


మెటీరియల్ అందజేస్తున్న శరత్‌బాబు తదితరులు

బంజారాహిల్స్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆశ్రయ్-ఆకృతి స్వచ్ఛంద సంస్థ మరో మైలురాయిగా బ్యాచిలర్ ఆఫ్ ఆడియాలజీ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పెథాలజీ కోర్సును ప్రవేశపెట్టడం శుభపరిణామమని, వినికిడి సమస్యల పరిష్కారానికి ఈ కోర్సు దోహదపడుతుందని స్టేట్ స్ట్రీట్ ప్రాజెక్ట్ డెలివరీ శరత్‌బాబు చితిరాల, రావూస్ ఈఎన్టీ డైరెక్టర్ డాక్టర్ శ్రీరావు కడప, ఆడిట్ కమిటీ చైర్ బోర్డుమెంబర్ హరి ఆవుల అన్నారు. శుక్రవారం శ్రీనగర్‌కాలనీలో ఆశ్రయ్-ఆకృతి ప్రవేశపెట్టిన బీఏఎస్ఎల్పీ కోర్సును ప్రారంభించారు. ఇప్పటికే బధిరులకు ఎన్నో సేవలను అందిస్తున్న సంస్థ డైరెక్టర్ డీపీకే బాబు ఆశ్రయ్-ఆకృతిలో ఆడియాలజీ కోర్సును విద్యార్థుల కోసం అందించడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో స్టేట్ స్ట్రీట్ సీఎస్ఆర్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ నీతూ చడ్డ, కాక్లియార్ టెర్రిటరీ అకౌంట్ మేనేజర్ అనూప్ పుల్యాల, స్టేట్ స్ట్రీట్ ఫైనాన్స్ ఏవీపీ రూపాలి, ఆశ్రయ్ ఆకృతి సిబ్బంది పాల్గొన్నారు.

చదవడం, రాయడంపై దృష్టి పెట్టాలి

బంజారాహిల్స్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి చదవడం, రాయడంపై దృష్టి పెట్టాలని హైకోర్టు న్యాయవాది నిహాల్ కోవలి అన్నారు. బంజారాహిల్స్‌లోని మెరీడియన్ స్కూల్‌లో శుక్రవారం ఇంటర్ విద్యార్థులు నిర్వహిస్తున్న మోడల్ యునైటెడ్ నేషన్స్(మోడల్ ఐక్యరాజ్య సమితి) కార్యక్రమాన్ని ఆయన మిలిటరీ కల్నల్ రజనీష్ కపూర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులు చదువుపై తప్ప కళలు, ఆటలలో తమకున్న ఆసక్తికి అనుగుణంగా ముందుకు సాగే పరిస్థితి లేదన్నారు. ప్రిన్సిపాల్ పూనం జా మాట్లాడుతూ మూడు రోజులపాటు ఈ మోడల్ యునైటెడ్ నేషన్స్ చర్చలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రహత్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బోరబండ డివిజన్ నూతన కార్యవర్గం

బోరబండ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బోరబండ డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఆ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేష్ ప్రకటించారు. పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకాల దీపక్‌రెడ్డి ఆదేశాల మేరకు కొత్త కార్యవర్గాన్ని ఆయన శుక్రవారం వెల్లడించారు. బీజేపీ డివిజన్ ఉపాధ్యక్షులుగా ఉష, చంద్రశేఖర్, డి.కిరణ్, బి.భాస్కర్, ప్రధాన కార్యదర్శులుగా సక్రయ్ కృష్ణ, అనూప్ కుమార్ సుంకరి, కార్యదర్శులుగా ఎం.అమరావతి, వి.శ్రీనివాస్ నాయక్, దుర్గ, ఈ.విజయ్ కుమార్, కోశాధికారిగా కోరె రాజేశ్వర్ నియమితులయ్యారు. అలాగే, డివిజన్ యువ మోర్చా అధ్యక్షుడిగా కె.దినేష్, బీసీ మోర్చా అధ్యక్షుడిగా పి.సునీల్‌గౌడ్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా వినోద్ కుమార్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా డి.రాజున్ పవార్, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా జ్యోతిబాయి, మైనారిటీ మోర్చా అధ్యక్షుడిగా షేక్ పాషా ఎన్నికయ్యారు.

గుండెపోటుతో బీజేపీ నేత మృతి


అశోక్ కుమార్(ఫైల్)

బేగంపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మేడ్చల్ జిల్లా లీగల్ సెల్ కో-కన్వీనర్ పిట్ల అశోక్ కుమార్ ముదిరాజ్(54) రెండు రోజుల క్రితం దుబాయిలో గుండెపోటుతో మృతిచెందాడు. బేగంపేటలోని అల్లంతోటబాయి ప్రాంతానికి చెందిన ఆయన చిన్నతనం నుంచే బీజేపీలో పనిచేస్తూ డివిజన్ అధ్యక్షుడి నుంచి ఎదిగారు. ప్రస్తుతం మేడ్చల్ జిల్లా బీజేపీ లీగల్ సెల్ కో-కన్వీనర్‌గా ఉన్నారు. ఆయన నివాసానికి శుక్రవారం మృతదేహం రావడంతో బీజేపీ నేతలు కాంతారావు, శ్యామ్‌సుందర్‌గౌడ్, అశోక్‌యాదవ్, విజయకుమార్, భూమయ్య, విజ్జిలాల్ తదితరలు నివాళులర్పించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఫోన్‌లో కుటుంబసభ్యులను పరామర్శించారు. పంజాగుట్టలోని శ్మశాన వాటికలో కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

వేధింపుల బారి నుంచి కాపాడండి

● ప్రభుత్వానికి ప్రైవేట్ హాస్టల్ నిర్వాహకురాలి విజ్ఞప్తి

పంజాగుట్ట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఉద్దేశపూర్వకంగా వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తుల బారి నుంచి కాపాడాలని, వారి నుంచి తనకు ప్రాణహాని ఉందని మాదాపూర్‌కు చెందిన ఓ ప్రైవేట్ హాస్టల్ నిర్వాహకురాలు నాగలక్ష్మి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మితో కలిసి ఆమె తన గోడును వెళ్లబోసుకున్నారు. డాక్టర్ వెంకటరమణికి చెందిన మాదాపూర్‌లోని భవనాన్ని అద్దెకు తీసుకొని ఎస్‌పీపీ పేరుతో ప్రైవేట్ హాస్టల్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పలు విషయాల్లో ఇరు వర్గాల మధ్య వివాదాలు నెలకొనడంతో తాను న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు చెప్పారు. ఈ విషయం న్యాయస్థానంలో కొనసాగుతుండగానే వెంకటరమణి, ఆమె నుంచి జీపీఏ పొందినట్లు చెబుతున్న దామోదర్ పలుమార్లు హాస్టల్ వద్దకు వచ్చి తమను దుర్భాషలాడుతూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల తన భర్త సత్యప్రకాష్‌పై తప్పుడు ఆరోపణలతో దాడులు చేయించి అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. సదరు వ్యక్తుల నుంచి తనకు ప్రాణహాని ఉందని ఆరోపించారు. భవిష్యత్తులో ఎలాంటి వేధింపులకు పాల్పడకుండా సదరు వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

కబరస్థాన్‌కు త్వరలో స్థలం కేటాయిస్తాం

● మంత్రి వివేక్ వెంకటస్వామి


మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం ఇస్తున్న ముస్లిం ప్రతినిధులు

బోరబండ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బోరబండలో కబరస్థాన్‌కు త్వరలో స్థలం కేటాయిస్తామని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఎస్పీఆర్ హిల్స్ హెచ్ఎఫ్ నగర్ ఫేజ్-2 ఫంక్షన్ హాల్లో మసీదు కమిటీలు, కబరస్థాన్ కమిటీల ప్రతినిధులతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రహ్మత్ నగర్ డివిజన్ అభివృద్ధి కోసం రూ. 20 కోట్లు మంజూరు చేశామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. తొలుత కబరస్థాన్‌కు స్థలం కేటాయించాలని మసీదు కమిటీల తరఫున మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. సమావేశంలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.డి.అజారుద్దీన్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్లా కొత్వాల్, సయ్యద్ నిజాముద్దీన్, రహ్మత్ నగర్ కబరస్థాన్ కమిటీ అధ్యక్షుడు ముక్రం బాయి, మన్నాన్ సాబ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌కు ముందే స్థలం కేటాయించాలి

ఎన్నికల కోడ్‌కు ముందే కబరస్థాన్‌కు స్థలం కేటాయించాలని బీఆర్ఎస్ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. శ్రీరామ్ నగర్‌లోని మాజీ కార్పొరేటర్ ఎంఏ షఫీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో నాయకులు వచ్చి హంగామా చేయడం, హామీలు ఇవ్వడమే తప్ప సమస్యలను పరిష్కరించరని విమర్శించారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర మైనార్టీ విభాగం నాయకులు ఎం.డి.ఆజం, ఎం.డి.అర్షద్ అలీఖాన్, యూసుఫ్, మొహిద్ ఖాన్, అఫ్రోజ్ ఖాన్, ఎం.డి.లియాఖత్ అలీ, సయ్యద్ బషీర్, ఎం.డి.ఫయాజుద్దీన్, ఎం.ఎ.సమద్, కె.నాగరాజు, ప్రసాద్, అహ్మద్ పటేల్, అబ్దుల్ ఘని, వాజీద్ పాల్గొన్నారు.



తెలంగాణ ట్రాన్స్‌కో కమర్షియల్ ఎస్ఈ హేమను సన్మానిస్తున్న శాసనసభ మాజీ స్పీకర్ మధుసూదనాచారి



ఎస్ఈ హేమను సన్మానిస్తున్న పద్మావతి

సేవాతత్పరతకు పెట్టింది పేరు విద్యుత్ శాఖ

పంజాగుట్ట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో సేవాతత్పరతకు విద్యుత్ శాఖ పెట్టింది పేరు అని కోదాడ శాసనసభ్యురాలు పద్మావతి అన్నారు. రెండు సంవత్సరాలుగా భారీ నుంచి అతి భారీ వర్షాలతో ఎన్ని ఉపద్రవాలు సంభవించినా విద్యుత్ ప్రసారంలో ఎటువంటి అంతరాయం కలగకుండా ఉండడమే ఇందుకు నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ట్రాన్స్‌కో కమర్షియల్ విభాగం సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్ఈ) కె.హేమ పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హేమను శాసనసభ మాజీ స్పీకర్ ఎస్.మధుసూదనాచారి, ఎమ్మెల్యే పద్మావతి ట్రాన్స్‌కో ఉన్నతాధికారులతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ విద్యుత్ ఉత్పత్తి నుంచి మొదలుకొని ట్రాన్స్‌మిషన్ వరకు నిరంతరాయంగా సరఫరా చేయడంలో విద్యుత్ శాఖ ఉద్యోగుల శ్రమ వెలకట్టలేనిదని పేర్కొన్నారు. మహిళలు విధి నిర్వహణలో అందిస్తున్న సేవలు అనిర్వచనీయమన్నారు. ట్రాన్స్‌కో ఏడీఈ కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో గ్రిడ్, ట్రాన్స్‌మిషన్ విభాగం డైరెక్టర్ జి.సంపత్ కుమార్, ప్రాజెక్ట్ డైరెక్టర్ లతావినోద్ కుమార్, కమర్షియల్, ఫైనాన్స్, ఎన్‌హెచ్ఆర్‌డి డైరెక్టర్ శ్రీనివాస్, ఇంజనీర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వరప్రసాద్ రెడ్డి, కొమ్ము నాగయ్య తదితరులు

'విశ్వ నియమాలు విశ్వ రహస్యాలు' ఆవిష్కరణ

తార్నాక, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : తార్నాక ప్రాంతానికి చెందిన డా.లక్కరాజు నిర్మల ఇటీవల తాను రచించిన 'విశ్వ నియమాలు విశ్వ రహస్యాలు' అనే పుస్తకాన్ని శుక్రవారం పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ వరప్రసాద్ రెడ్డి, ఐఐటీ శాస్త్రవేత్త డా. కొమ్ము నాగయ్య చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. నిర్మల రచించిన ఈ పుస్తకం ప్రతీ ఒక్కరికి మార్గదర్శకమవుతుందని, భావితరాలకి కూడా ఉపయోగపడేవిధంగా ఉందని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో కొండపల్లి నరసింహారావు, వసంత తదితరులు పాల్గొన్నారు.


సుబ్బరామయ్యని శాలువతో సత్కరిస్తున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

121 మంది ఉద్యోగుల పదవీ విరమణ

చిలకలగూడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్‌లో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 121 మంది ఉద్యోగులు శుక్రవారం పదవీ విరమణ చేశారు. వారు హెడ్‌క్వార్టర్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లతో పాటు లాలాగూడ వర్క్‌షాపులో విధులు నిర్వహించారు. పదవీ విరమణ ఉద్యోగులకు ఆత్మీయవీడ్కోలు పలుకుతూ సికింద్రాబాద్‌లోని కార్యాలయాలు సందడిగా మారాయి. అకౌంట్స్ విభాగం సికింద్రాబాద్ డివిజన్‌లో సీనియర్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసరావు, లేఖాభవన్‌లో బిక్షీ, రాంబాబు, రాఘవరావులను మజ్దూర్ యూనియన్ కార్యదర్శి చింతకుంట రామకృష్ణ శాలువతో సత్కరించారు. రైల్ నిలయంలో అకౌంట్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ సెక్షన్ ఆఫీసర్ సుబ్బరామయ్య, అసిస్టెంట్ ఫైనాన్షియల్ అడ్వైజర్‌గా పదోన్నతి పొందడంతో మజ్దూర్ యూనియన్ నాయకులు శాలువాలు కప్పి సత్కరించారు.


తహసీల్దార్‌కు సన్మానం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

తహసీల్దార్‌కు సన్మానం

అడ్డగుట్ట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మారేడుపల్లి తహసీల్దార్ భీమయ్య గౌడ్ ఈనెల 30న పదవీ విరమణ చేయడంతో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ డీసీసీ జిల్లా చైర్మన్ గంట రాజు సాగర్‌తో పాటు సికింద్రాబాద్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అనంత కృష్ణారావు, భూపతి హరి, నవీన్, విలన్, సాయి చందర్, మహిళా నాయకురాళ్లు తహసీల్దార్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా గంట రాజు సాగర్ మారేడుపల్లి తహసీల్దార్‌గా విశిష్ట సేవలందించారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేయడంలో ఆయన నిష్పక్షపాతంగా పనిచేశారని తెలిపారు.


దుకాణాల ఎదుట మెట్ల కూల్చివేత పనులను పరిశీలిస్తున్న మార్కెట్ చైర్మన్ ఆనంద్‌బాబు, కార్యదర్శి వెంకన్న తదితరులు

దుకాణాల ఎదుట నిర్మించిన మెట్ల కూల్చివేత

సికింద్రాబాద్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): దుకాణాల ఎదుట అక్రమంగా నిర్మించిన మెట్లను బోయినపల్లి మార్కెట్ అధికారులు నేలమట్టం చేశారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే మార్కెట్‌లో ట్రాఫిక్ సమస్యకు కారణమయ్యారని, భవిష్యత్‌లో ఇటువంటి పొరపాట్లు చేస్తే ఉపేక్షించేది లేదని కమీషన్ ఏజెంట్లను అధికారులు హెచ్చరించారు. బోయినపల్లి వ్యవసాయ మార్కెట్‌లోని 25 దుకాణాల ఎదుట కొందరు కమీషన్ ఏజెంట్లు అక్రమంగా మెట్లు నిర్మించారు. వీటి వలన కూరగాయలు తదితర వస్తుసామగ్రి తీసుకువచ్చే వాహనాల రాకపోకలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. పైగా ప్రతి రోజూ ఉదయం పూట విపరీతమైన ట్రాఫిక్ జామ్ అవుతోంది. వీటిని దృష్టిలో ఉంచుకుని శుక్రవారం బోయినపల్లి మార్కెట్ చైర్మన్ రాగీరు ఆనంద్‌బాబు, కార్యదర్శి వెంకన్నలు మార్కెట్ మొత్తం పర్యటించారు. ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్న మెట్లను తొలగించడమే పరిష్కారంగా భావించారు. వెంటనే సిబ్బందిని పిలిపించి, 25 దుకాణాల ఎదుట నిర్మించిన మెట్లను కూల్చివేశారు.


తార్నాకలోని ఎన్ఎంఐఎంఎస్ కాలేజీ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి నాయకులు

ఆ కాలేజీని వెంటనే మూసివేయాలి

తార్నాక, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : తార్నాకలో అనుమతి లేకుండా నడిపిస్తున్న నర్సీమూంజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (ఎన్ఎంఐఎంఎస్) కాలేజీని వెంటనే మూసివేయాలని డిమాండ్ చేస్తూ ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు శుక్రవారం తార్నాకలోని ఎన్ఎంఐఎంఎస్ కళాశాల ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో ఓయూ పోలీసులు కళాశాల వద్దకు చేరుకుని విద్యార్థి నాయకులను అరెస్టు చేసి ఓయూ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మనబోయిన సైదులు యాదవ్, తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భారీ అశోక్ మాట్లాడుతూ ముంబై యూనివర్సిటీకి చెందిన ఎన్ఎంఐఎంఎస్ కళాశాల యాజమాన్యం రాష్ట్ర హైయ్యర్ ఎడ్యుకేషన్ నుంచి ఎటువంటి అనుమతు లు తీసుకోకుండా అక్రమంగా నడిపిస్తున్నదని ఆరోపించారు. యూజీసీ నింబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న కళాశాలపై త్వరలో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

క్రిస్టియన్ యువజన మహోత్సవాలు

రెజిమెంటల్‌బజార్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కాకినాడలోని ఫ్యాబిన్ కన్వెన్షన్ హాల్‌లో అక్టోబర్ 1,2వ తేదీల్లో జరిగే క్రైస్తవ యువజన మహోత్సవాలకు తరలి రావాలని సీవైఎఫ్ తెలంగాణ కో ఆర్డినేటర్ రావులపాటి మోజెస్ పిలుపునిచ్చారు. శుక్రవారం సికింద్రాబాద్ వైఎంసీఏ జరిగిన సన్నాహక సమావేశంలో ఉత్సవాల జాతీయ కార్యదర్శి కలవల జాన్ విక్లిఫ్‌తో కలిసి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

భక్తి శ్రద్ధలతో గణపయ్యకు పూజలు


కంసారి బజార్‌లో గణపతి మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, మార్కెట్ యార్డు చైర్మన్ ఆనంద్ బాబు


మధురానగర్‌కాలనీలో మహా హరతి కార్యక్రమంలో బీజేపీ మహిళా నాయకులు, మహిళలు


బోయినపల్లి పోలీస్ స్టేషన్ వద్ద గణపతి మండపంలో ప్రత్యేక పూజలు చేస్తున్న వివిధ కాలనీల ప్రతినిధులు


రాష్ట్రపతి రోడ్డులో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఉత్తర మండల డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్, మహంకాళి ఏసీపీ సైదయ్య, తదితరులు

బోయినపల్లి, బౌద్ధనగర్, అడ్డగుట్ట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి ప్రాంతంలో కాలనీలు బస్తీలలో, అపార్ట్‌మెంట్‌లలో వినాయక చవితి వేడుకలు భక్తి శ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా శుక్రవారం కుంకుమ పూజలు, లక్ష పుష్పార్చన నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో కుంకుమపూజలో పాల్గొన్నారు. సంచారపురి కాలనీలో జరిగిన వేడుకలకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ పాల్గొని కాలనీ వాసులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు వివిధ కాలనీల మహిళలు పాల్గొన్నారు. రాంగోపాల్‌పేట్‌లోని ఓల్డ్ బోయిగుడా ఫ్రెండ్స్ అసోసియేషన్ వారు 42 సంవత్సరాలుగా రాష్ట్రపతి రోడ్డులో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పూజల్లో ఉత్తర మండల డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్. వెంట మహంకాళి ఏసీపీ సైదయ్య, ఇన్‌స్పెక్టర్ పరశురామ్, నిర్వాహకులు మల్లికార్జున్ గౌడ్ ఉన్నారు. సీతాఫల్ మండి టీఆర్‌టీ కాలనీలో టీఆర్‌టీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావు గౌడ్ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మండప నిర్వాహకులు ఎమ్మెల్యేను సత్కరించారు. సభ్యులు రాజేష్‌సింగ్, జగ్గు శేఖర్, సంజయ్ తదితరులు ఉన్నారు. మధురానగర్‌కాలనీలో బీజేపీ నాయకురాలు మేకల కీర్తి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండపం వద్ద మహా హరతి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.


రాంగోపాల్‌పేట్.. ఓల్డ్ ఘాస్మండి దర్గాలేన్‌లో 8 కిలోల ఇలాచీలతో తయారు చేసిన విఘ్నేశ్వరుడు


మారేడుపల్లిలోని భక్తులను ఆకట్టుకున్న కలకత్తా వెరైటీ గణనాథుడు


సీతాఫల్‌మండి వినాయక మండపంలో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ , తదితరులు


మారేడుపల్లిలో 5000 మందికి మండపంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన ఇంక్రెడిబుల్ ఇండియా ప్రాజెక్ట్ నిర్వాహకులు


బేగంపేట: సనత్‌నగర్ మోడల్‌కాలనీలోని గణపతి మండపంలో సాంస్కృతిక నృత్యాలు చేస్తున్న బాల బాలికలు

10 నుంచి ప్రతి నెలా 'కంటోన్మెంట్ వాణి'

ప్రజావాణి స్ఫూర్తితో ఈ వినూత్న కార్యక్రమం: ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కాలనీలు, బస్తీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయడమే ప్రధాన లక్ష్యంగా వచ్చే నెల 10వ తేదీ నుంచి 'కంటోన్మెంట్ వాణి' కార్యక్రమం నిర్వహించనున్నట్టు స్థానిక శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ తెలిపారు. ప్రతి నెలా 10న నిర్వహించే ఈ వినూత్న కార్యక్రమంలో ఆయా విభాగాల అధికారులు సైతం పాల్గొంటారని, తద్వారా ప్రజా సమస్యల సత్వర పరిష్కారం సాధ్యమవుతుందని చెప్పారు. ప్రజావాణి కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకుని 'కంటోన్మెంట్ వాణి' చేపట్టాలని నిర్ణయించినట్టు ఆయన వెల్లడించారు. శుక్రవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్‌తో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కంటోన్మెంట్ వాణిలో భాగంగా ప్రతి నెలా ఒక్కో వార్డుకు వెళ్లి, ప్రజల మధ్యన కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన చెప్పారు. ఒక్కో నెలా ఒక్కో వార్డులో నిర్వహించడం వలన ఆ వార్డులో నివసించే ప్రజలు పెద్ద ఎత్తున హాజరై వారి సమస్యలు తెలుపే అవకాశం కలుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. తొలుత సెప్టెంబర్ 10న ఒకటో వార్డులో కంటోన్మెంట్ వాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరిగే అవసరం లేకుండా, వారి మధ్యకు వెళతామని, అటు రాష్ట్ర ప్రభుత్వ, ఇటు కంటోన్మెంట్ బోర్డు అధికారులు హాజరవుతారని, దీంతో ప్రజలకు మేలు కలుగుతుందని శ్రీగణేష్ చెప్పారు.


కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

కాగా తన ప్రతిపాదనకు కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ అంగీకరించారని అన్నారు. ఇదిలా ఉండగా వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఈఓతో చర్చించినట్టు ఆయన తెలిపారు. జూబ్లీబస్ స్టేషన్‌లో పార్కింగ్ సదుపాయం, టాయిలెట్ల నిర్మాణం, చిన్నకమేళాలలో రోడ్లు, బోర్‌వెల్స్‌కు, బస్తీదవాఖానలకు స్థలాలు కేటాయించాలని కోరినట్టు ఎమ్మెల్యే శ్రీగణేష్ వివరించారు.

గుండెపోటుతో బీజేపీ నేత మృతి


అశోక్ కుమార్ ముదిరాజ్ (ఫైల్)

బేగంపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మేడ్చల్ జిల్లా లీగల్ సెల్ కో-కన్వీనర్ పిట్ల అశోక్ కుమార్ ముదిరాజ్(54) రెండు రోజుల క్రితం దుబాయిలో గుండెపోటుతో మృతిచెందాడు. బేగంపేటలోని అల్లంతోట బాయి ప్రాంతానికి చెందిన అశోక్ కుమార్ ముదిరాజ్ చిన్నతనం నుంచే బీజేపీలో పనిచేస్తూ డివిజన్ అధ్యక్షుడి నుంచి జిల్లా స్థాయిలో పలు పదవులను నిర్వహించారు. ప్రస్తుతం మేడ్చల్ జిల్లా బీజేపీ లీగల్ సెల్ కో- కన్వీనర్ ఉన్నారు. ఐటీ ఉద్యోగి అయిన కారణంగా నెల రోజుల క్రితం ఆఫీసు పని మీద దుబాయికి వెళ్లాడు. అయితే రెండు రోజుల క్రితం తీవ్ర గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బేగంపేటలోని అల్లంతోటబాయిలోని నివాసానికి శుక్రవారం పిట్ల అశోక్ మృతదేహం రావడంతో బీజేపీ నేతలు కాంతారావు, శ్యామ్‌సుందర్ గౌడ్, అశోక్‌యాదవ్, విజయకుమార్, భూమయ్య, విజ్జిలాల్ తదితరులు ఆయన మృత దేహానికి నివాళులర్పించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఫోన్‌లో కుటుంబసభ్యులను పరామర్శించారు. పంజాగుట్టలోని శ్మశాన వాటికలో పిట్ల అశోక్‌కుమార్ ముదిరాజ్ భౌతిక కాయానికి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

'తెలంగాణ బచావో మూమెంట్' అధ్యక్షుడిగా రహీం

తార్నాక, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన రహీం తెలంగాణ బచావో మూమెంట్ ఓయూ జేఏసీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, తెలంగాణ బచావో మూమెంట్ వ్యవస్థాపకులు డా.పిడమర్తి రవి శుక్రవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రహీం మాట్లాడుతూ తెలంగాణ వనరులు తెలంగాణ ప్రజలకే దక్కాలనే నినాదంతో యువతను చైతన్యపరుస్తామన్నారు. తెలంగాణలోని అన్ని ప్రైవేటు కంపెనీలలో న్యాయబద్ధంగా తొంబై శాతం ఉద్యోగాలు స్థానికులకు దక్కేవిధంగా పోరాటం చేస్తామని తెలిపారు.

క్రీడాకారులు ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవాలు


వ్యాయామ ఉపాధ్యాయుడు సుమన్‌ను సత్కరిస్తున్న లాలూ నాయక్‌తో క్రీడాకారులు


నీపిడ్‌లో క్రీడా దినోత్సవ వేడుకలను ప్రారంభిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ కీర్తన యాదవ్

బోయినపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని సికింద్రాబాద్ బోయినపల్లి మనోవికాస్ నగర్‌లో గల నీపిడ్ (జాతీయ మేధో వైకల్యాలున్న వ్యక్తుల సాధికారత సంస్థ) లో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉస్మానియా మెడికల్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కీర్తన యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దేశంలోని క్రీడాకారులందరికీ ధ్యాన్‌చంద్ స్ఫూర్తి అని కొనియాడారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలలో..

బోయినపల్లి, (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి బాపూజీ నగర్‌లో గల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ బానోతు లాలూ నాయక్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు సుమన్ అలాగే తెలుగు ఉపాధ్యాయురాలు ఎల్లమ్మను ప్రధానోపాధ్యాయులు బాణోతు లాలు ప్రత్యేకంగా సన్మానించారు. జాతీయ స్థాయిలో పాల్గొన్న క్రీడాకారులను సన్మానించి ప్రశంసా పత్రాలు అందించారు.

రైల్వేలో క్రీడాదినోత్సవం

చిలకలగూడ, (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ రైల్వే రిక్రియేషన్ గ్రౌండ్స్‌లో జాతీయ క్రీడాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అతిథులుగా ద.మ.రైల్వే క్రీడా కార్యదర్శి కోటేశ్వర రావు, స్పోర్ట్స్ ఆఫీసర్ జె.జె. శోభ హాజర య్యారు. కార్యక్రమంలో రాష్ట్ర జిమ్నాస్టిక్స్ కోచ్ శ్రీనివాస్, కోచ్ విజయ కుమార్ పాల్గొన్నారు.


ప్రభుత్వ పాఠశాల ముందు నిలబడిన కుక్కలు


బడికి పోదామంటే భయం..!

- స్కూలు పిల్లల వెంటపడుతున్న కుక్కలు
- అడ్డగుట్టలో బడికి దూరమవుతున్న విద్యార్థులు

అడ్డగుట్ట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : బడికి వెళదామంటే కుక్కల భయం, దీంతో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపించకుండా ఇంటికే పరిమితం చేస్తున్నారు. అడ్డగుట్టలోని ప్రభుత్వ స్కూలు ఎదురుగా గుంపులు గుంపులుగా ఉన్న కుక్కలు రోడ్లపైనే కాపు కాస్తున్నాయి. బడికి వచ్చే విద్యార్థులను కరుస్తుండడంతో భయానక పరిస్థితి ఏర్పడింది. కుక్కల్ని పట్టుకెళ్లేందుకు జీహెచ్ఎంసీ సిబ్బంది ఎవరూ రావడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఫోన్ ద్వారా సిబ్బందికి ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడంలేదు. అడ్డగుట్ట ప్రభుత్వ స్కూలు ఎదురుగా మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయం, శాస్త్రీనగర్ లంబాడిబస్తీలో కుక్కల బెడద కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి అయిందంటే చాలు.. ఈ ప్రాంతంలో కుక్కల భయంతో పిల్లలు బయటికి వెళ్లలేని పరిస్థితి. రోడ్డుపైనే వచ్చిపోయే వాళ్లను కరుస్తున్నాయి. జీహెచ్ఎంసీ సిబ్బంది కుక్కలను పట్టేందుకు నెల రోజుల క్రితం వీధుల్లోకి వచ్చి కుక్కలు ఎక్కడా లేవని తిరిగి వెళ్లిపోయారు. కొందరు పిల్లలైతే బడికి పంపించకుండా ఇంటి వద్దే ఉంచూతు తల్లిదండ్రులు పనికి వెళ్లిపోతున్నారు. కుక్క కరిస్తే బొడ్డు చుట్టూ ఇంజెక్షన్లు తీసుకోవాలని, అవి కరిస్తే చనిపోతున్నారంటూ చాలామంది భయాందోళనకు గురవుతున్నారు. శాస్త్రీనగర్‌లో ఆరేళ్ల బాలుడు, ప్రభుత్వ స్కూలు ముందు ఆరవ తరగతి చదువుతున్న బాలుడు, లంబాడిబస్తీలో ఓ వృద్ధుడిని కుక్క కాటు వేయడంతో ఆస్పత్రి పాలయ్యారు.

'గాంధీ'లో మొరాయించిన మంచినీటి మోటార్లు

- ఆరు గంటల పాటు నీటి సరఫరా బంద్
- పబ్లిక్ టాయిలేట్‌లో నీళ్లు లేవు
- మినరల్ వాటర్ బాటిళ్లతో సరిపెట్టుకున్న రోగులు
- పాత మోటార్లతో నీటి సరఫరా చేయించిన ఆర్ఎంఓ శేషాద్రి


గాంధీ ఆస్పత్రి

అడ్డగుట్ట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలో నీటి సరఫరా బంద్ కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గురువారం రాత్రి సమయంలో ఒక్కసారిగా ఆస్పత్రి ఆవరణలో ఉన్న మంచినీటి రిజర్వాయర్ లో ఉన్న మంచినీటి మోటార్లు మొరాయించడంతో దాదాపు ఆరు గంటల పాటు రాత్రి నుంచి తెల్లవారుజామున వరకు చికిత్స పొందుతున్న రోగులు, సహాయకులు నరకయాతన పడ్డారు. శుక్రవారం ఉదయం సమాచారం అందుకున్న ఆర్ఎంఓ డాక్టర్ శేషాద్రి పర్యవేక్షణలో రిజర్వాయర్‌లో ఉన్న మోటార్లను తొలగించి మళ్లీ పాత మోటార్ల ద్వారా శుక్రవారం ఉదయం నీటి సరఫరా అందించారు. సమయంలో రోగులు కాలకృత్యాలు తీర్చుకోలేక ఇబ్బందులు పడ్డారు.

రోగుల హైరానా

రాత్రి నుంచి నీటి సరఫరా బంద్ కావడంతో ఒక వైపు కాలకృత్యాలు తీర్చుకునేందుకు దుకాణాల్లో మంచినీటి బాటిళ్లతో రోగులు సరిపెట్టుకున్నారు. ఆస్పత్రి ఆవరణలో ఉన్న పబ్లిక్ టాయిలెట్‌లో కూడా నీళ్లు లేకపోవడంతో రోగులు హైరానా పడ్డారు.


మంచినీళ్ల కోసం కుళాయి వద్ద వేచి ఉన్న మహిళ


పాడైపోయిన మంచినీటి మోటార్లకు మరమత్తులు చేస్తున్న దృశ్యం


ఈస్ట్ మారేడుపల్లి షెనాయ్ క్రీడా మైదానం చౌరస్తాలో విద్యుత్ స్థంభానికి ఏర్పాటు చేసిన వివిధ సంస్థలకు చెందిన ప్రైవేట్ కేబుల్స్, అలాగే ట్రాఫిక్ సిగ్నల్ స్థంభానికి, వాటి పక్కనే చెట్ల కొమ్మలకూ వేలాడతీయడం గమనార్హం.

(మారేడుపల్లి - ఆంధ్రజ్యోతి)